# చౌరస్తాలో చెదరంగం

"ఒరేయ్ ప్రవీణ్" పట్టపగలు నట్ట నడిబజారులో చేతక్ స్కూటర్ మీదెళ్తున్న చేతన్ కళ్లు వింతకాంతులు పుంజుకున్నాయి. కుడికాలు బ్రేకు పీక నొక్కేసింది. కీచుమంటూ స్కూటర్ చౌరస్తాలో ఆగింది.

హీరో హోండా మీద హీరోలా వస్తున్న ప్రవీణ్‌కు ఆ పలకరింపు పూదోటలో పైరగాలి కెరటంలాగన్పించింది.

"ఒరేయ్ చేతన్ ! హబ్బా" హీరోహోండాకు బ్రేకు వేసి సర్దుక్కొచున్నాడు. "ఎన్నాళ్లకు కనబడ్డావురా !" సంతోషం గంతులేస్తూంది. దుబాయ్‌లో తెలుగువాడు కలిసినంత ఆనందం ...

ఎదురెదురుగా... సావర్కర్ చౌరస్తాలో సావకాశంగా మాట్లాడుకుంటున్నారు. నాల్గుతోవల మధ్య చిరునవ్వులు రువ్వుకుంటున్నారు.

"సంవత్సరం దాటింది... నువు మాత్రం నల్లపూసవై పోయినావురా. అమ్మ ఎప్పుడూ నిన్ను గుర్తు చేస్తుంది..." చేతన్ చెయ్యి ఆనందంగా ముందుకొచ్చింది.

"నువ్వైతే మా అమ్మ కళ్లల్లో మెరుస్తున్నావట. అఫ్‌కోర్స్ .... మా నోళ్లల్లో కరిగి పోతున్నావనుకో...." ప్రవీణ్ చెయ్యి ముందుకొచ్చింది. కరచాలనం... కమ్మని అనుభూతి.

"ఏం చెయ్యాల్రా ... వ్యాపారం పనులు" మళ్లీ ప్రవీణే అందుకున్నాడు. "ఊళ్లు తిరగడమెక్కువైంది. నీకేందిరా ... టీచరుద్యోగం బతక నేర్చినోడే బడి పంతులన్నట్టు... కడుపులో చల్ల కదలకుండా ఉంటున్నావు ... నేనీ రోజు ఇక్కడున్నాను... రేపెక్కడో... గతవారం రోజుల్లో ఓరోజు హైద్రాబాదు, ఇంకోరోజు నిజామాబాదు..." ఏరోజు ఏ ఊళ్లో ఉన్నాడో వివరిస్తున్నాడు.

"ఆఁ... ఉద్యోగంలో ఏముందిరా... ఉత్త చెత్త ! ఎన్నాళ్లు ఉద్యోగం వెలగ బెట్టినా గొర్రెతోక బెత్తెడే అన్నట్లు... మధ్య తరగతి మందహాసమే..." చేతన్ మాటకారి తనం ఆశ్చర్యపరిచింది ప్రవీణ్‌ను.

హీరో సైకిల్, హీరోహోండా దాకా ఏకబిగిన పరుగెత్తుకొచ్చింది. అటు టక్కున బ్రేకు వేసుకొని చటుక్కున్న ప్రక్కకు తప్పుకుంది. సైకిల్‌వాలా చురచుర చూపులు.

"ఓర్నీ..." ప్రవీణ్‌కు నవ్వొచ్చింది. "నెలనెలా జీతం డబ్బులు రక్కున చేతిలో కనపడుతూంటే ... హాయిగా లెక్కబెట్టుకుని కులాసాగా బతకొచ్చు గదరా ! ఆ అవకాశం అందరికీ ఉంటుందా ?"

"చాల్లేరా ! దూరపు కొండలు నునుపు. ఎంతైనా వ్యాపారాన్ని మించుద్దా ?"

స్లో మూవీలో వస్తున్న టి.వి.యస్. చేతక్ దాకా వచ్చి ముద్దు బెట్టుకోబోయి పక్కకు తప్పుకుంది.

"నీయవ్వ ! ఈ చౌరస్తా వీళ్ల సొంతమేమో !" ప్రవీణ్ నల్లని మీసం కట్టుకింద తెల్లని పలువరుస మెరిసింది. "ఈ రోజుల్లో పరుగెత్తి పాలు తాగేకంటే నిల్చుండి నీళ్లు తాగడమే మేలని పిస్తుందిరా... .వ్యాపారమంటే ఉరుకులు పరుగులు, అదృష్టమ్మీద ఆధారపడుంటుంది..."

"అవునా ... కొద్ది రోజుల్లో ... రైసుమిల్లులు మూతపడ్తాయంటున్నారు నిజమేనా ప్రవీణ్ ?" చేతన్ ఆసక్తి.

"అదే అంటున్నా గదా ... ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేము. ధాన్యం ధర ఎక్కువ చెల్లించాలని రైతులతో గొడవ, తక్కువ ధరకు లేవీ బియ్యం గోదాముకు ఇచ్చి తీరాలని ప్రభుత్వం కండిషన్, సందుల్లో సడేమియా అన్నట్లు... కూలీ రేట్లు పెంచాలని లేబర్ లొల్లి. అప్పు తెచ్చి పెట్టిన పెట్టుబడి... దాని మీద పెరుగుతున్న వడ్డీలు ... చఛా... రైసు వ్యాపారంలో పైసా లాభం లేదురా ..." ప్రవీణ్ పెదాలు చప్పరించాడు.

వెనక నుంచి స్కూటర్, ముందు నుండి ఆటో ... మధ్యన చాయ పార్సల్ బాయ్... గడగడలాడుతూ పరేషానై పోయిండు. చాయనేల పాలైంది. బాయ్ కళ్లల్లో నీళ్లు గిర్రుమన్నై. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పింది.

ప్రవీణ్, చేతన్ ప్రాణస్నేహితులు, పక్కపక్క ఊరివాళ్లు. పదిహేనేళ్ల క్లాస్‌మేట్సు.. గ్లాసుమేట్సు కూడా... కంచాలు వేరైనా ఒకే మంచమ్మీద పడుకున్నారు. ఒకే లైటు కింద చదువుకున్నారు. ఒకే బార్‌లో బీరు తాగారు. ఒక సారి డిగ్రీలు పుచ్చుకున్నారు. అసలు జీవితములో ప్రవేశించే సరికి దారులు వేరైపోయినై. ప్రస్తుతం బయటి ప్రపంచానికి సంబంధం లేకుండా ముచ్చట్లలో మునిగిపోయారు. వచ్చీపోయే వాహనాల హారన్లు, మోతలు చెవులకు సోకడం లేదు.

"ఉద్యోగంలో మాత్రమేముందిరా ? చిన్న ఉద్యోగులకు తక్కువ జీతం... ఇల్లు గడవడమే కష్టం. పెద్ద ఉద్యోగులకు ఇన్‌కంటాక్సు, ప్రొఫెషనల్ టాక్సు... రకరకాల టాక్సుల గొడవ. హోదా మెయింటెన్‌చేసి తీరాలాయె. పండగ, పబ్బాలకు పెళ్లిళ్లు పేరంటాలకు... అప్పు తప్పదనుకో..."

"అన్నట్టు మన క్లాసుమేట్సు ... స్రవంతి, సంతోష్‌ల ప్రేమాయణ మెంతవర కొచ్చిందటా ..." టాపిక్ మారింది, ట్రాఫిక్ గుర్తురాలేదు.

"వాళ్లు భగ్న ప్రేమికులవుతారను కున్నాం గాని, పెద్దల నెదిరించి పెళ్లి చేసు కున్నారటా ...."

నాలుగు దిక్కుల నుండి వచ్చీ పోయే వాహనాల రొదలు వినబడ్డం లేదు. బాటసారుల రుసరుసలు, చిల్లెర వ్యాపారుల చుచుర చూపులు... ఇలాంటివేవీ గుర్తింపుకు రావడం లేదు. అదో తమాషాగా మారింది.

ఉత్తరం రోడ్డు నుండి ఆవు 'అంబా' అంటూ వచ్చి నుంచుంది. దక్షిణం రోడ్డు నుండి దూసుకొస్తున్న అంబాసిడర్ కారు ఆన్‌దిస్పాటు మిత్రులనుండి పక్కకు తప్పుకుని ఆవును, హీరోహోండాను కలిపి గుద్దేసింది. ఆవు ఎగిరి చేతక్‌ను గుద్దేసింది.

"అమ్మో ... వామ్మో..."

"అయ్యో.... అయ్యయ్యో ..."

స్నేహితుల అరుపులు చౌరస్తా నదరగొడ్తున్నాయి.

"అనుకున్నంత అయ్యింది."

"ఎక్కడ జాగా దొరకనట్టు ఇక్కడనే నిల్చుంటారు. చౌరస్తాల బండ్లు ఆపుకుని బాతాకానీ కొడ్తరు..."

"ఏమన్నా అంటే ... ఇది నీ అబ్బ జాగీరా అంటారు."

"అరె .... ఏదన్నా హోటల్లోనో, అరుగు మీదనో కూచుని మాట్లాడుకోవచ్చు గదా..."

"రోడ్డుపక్కన బండ్లు ఆపుకుని మాట్లాడుకోవచ్చు గదా ..."

పక్కపక్క దుకాణాదారుల వ్యాఖ్యానాలు.

చుట్టూరా జనాలు నాలుగు దిక్కులా ట్రాఫిక్ బంద్. ఆందోళన .... అల్లకల్లోలం...

"పోయేకాలం దాపురిస్తే గట్లనే ఉంటుందిలే"

"జెరంత కామన్ సెన్సు లేనోళ్ల గతి గంతేలే."

సరదాగా చాయతాగుతూ కబుర్లాడుకుంటూ ప్రమాదం సంగతి విని... కేసు బుక్ చేసేందుకు బయలుదేరుతున్న పోలీసుల రొటీన్ కామెంట్స్.

***(జలధి – 16-12-2003)***